# సారీ - సారిక

"హలో శ్రీధర్! హౌ డూయుడూ?" చదువుకుంటున్న శ్రీధర్ నెత్తిమీద మొట్టికాయ గట్టిగా తగిలేసరికి తలెత్తి చూశాడు.

ఎదురుగా సారిక! అద్భుతమైన అందం ఆమెది. అందంకు మందంగా మేకప్ చేసుకోవడంతో ఆనందం కలిగిస్తూ నిల్చున్నది సారిక.

"హాయ్ సారీ! ఎప్పుడొచ్చావు?"

"ఉదయం వచ్చి.... రోడ్లన్ని తిరిగి తిరిగి ఇప్పుడు స్కూల్‌కొచ్చాను."

"హహ! నాటీ! ఎప్పుడంటే స్కూల్‌కు ఎప్పుడని కాదు... నా దగ్గరికి ఎప్పుడు వచ్చావు అని!" శ్రీధర్ చెప్పాడు.

"మొహం చూడు మొహం! ఎప్పుడో వస్తే నిన్ను చదువుకోనిస్తానా? ఇంతకీ అంత సీరియస్‌గా ఏం చదువుతున్నావు?" పుస్తకం లాక్కుని గబగబా పేజీలు తిప్పింది.

"జనరల్ నాలెడ్జి! నెక్స్టు వీకు కాంపిటీటివ్ ఎగ్జామ్ రాయాలిగా!"

"నీ మొహంలే! ఆ పోస్టులన్నీ ఎప్పుడో రిజర్వు అయిపోయాయి. ఏదో ఫార్మాలిటీసుకోసం ఎగ్జాము పెడుతున్నారు. వేస్టు రాయడం." చెప్పింది అతన్ని ఉడికిస్తూ.

"అబ్బా! నీకెవరు చెప్పారు?"

"అపాయింట్ చేసే ఆయన మా అంకుల్ లే!"

"మరి నాకు ఓ పోస్టు ఇప్పించవచ్చుగా!"

"తప్పకుండా-ఓ రెండు లక్షలు నీవి కావనుకుంటే...."

"అంత చీప్‌గా నా? నా కొద్దులే-మన లెవల్ నాలుగు లక్షలు." నవ్వేశాడు శ్రీధర్.

సారికా నవ్వేసింది నటన ఆపి. ఇంతలోనే మిగతా టీచర్లు కూడా వచ్చారు శృతి కలపడానికి.

"హలో ప్రభూ! కాసేపట్లో మీ అందరికీ పార్టీ ఏర్పాటు చేశాను - స్వీకరించండి" సారిక చెప్పింది.

"సారికగారూ! దేనికో చెప్పలేదు?"

"ఎక్కువైంది - సారిక అంటే చాలు!"

"సారీ."

"తక్కువైంది - సారిక అంటే చాలు!"

"ఓ సారిక - ఐ మీన్ సారీ! ఇంతకీ దేనికోసం ఈ పార్టీ!"

"సర్‌ప్రైజ్! తిన్న తర్వాత తెల్సుకుంటారు."

"నాకు చెవిలో చెప్పు!" శ్రీధర్ అడిగాడు.

సారిక తన నోరు అతని చెవి దగ్గర ఆనించింది.

ప్రభు కూడా తన తలకాయ ఆ చెవి దగ్గరికి తెచ్చాడు విందామని.

"భౌ" అని పెద్దగా అరిచింది సారిక.

"అబ్బా!" అంటూ చెవి పట్టుకున్నాడు శ్రీధర్.

మెరుపువేగంతో ప్రభు చెంప పగులకొట్టింది సారిక.

కళ్లెంబడి నీళ్ళు తిరుగుతూంటే ఏంటన్నట్లు చూశాడు ప్రభు.

"దోమకెంత ధైర్యం! నీ పాల బుగ్గలమీద వాలి నిన్ను కొరుకుతుందా! దెబ్బకు చచ్చి కింద పడింది." సారిక వివరించింది.

ప్రభు తిన్న దెబ్బ మర్చిపోయి పెద్దగా నవ్వాడు.

"ఇంకా నయం! ఈగవాలలేదు తలకాయమీద. బండ ఎత్తి వేసేది దేవి!" ఆనంద్ కామెంట్ చేశాడు.

"ఆ! తప్పకుండా! నీ తలకాయ మీద వాలితే చెప్పు చెప్పు తీసుకొని కొడతా!" సారిక.

"హలో! ఏం జరుగుతున్నది ఇక్కడ!" మేడం అరుచుకుంటూ వచ్చింది.

"క్లాసులకు వెళ్ళకుండా ఇక్కడేం చేస్తున్నారు?"

"మేడం-మన సారిక పార్టీ ఇస్తున్నదట....."

"పనిలేదా?"

"పార్టీ మేడం - మీక్కూడా?"

"నాకొద్దు-మీరే తినండి - సుష్టుగా. గో అండ్ అటెండ్ ది క్లాసెస్..... చల్ వినబడలేదా?" కసురుకుంది మేడం.

"సారిక! నీ అల్లరి ఎక్కువైపోతున్నది. చకచక క్లాసుకుపో!"

"నాకు చక చక రాదు... దఢ దఢ వస్తుంది."

"సరే! అలాగే పోవమ్మా తల్లీ!"

అందరూ డిస్పర్స్ అయిపోయారు.

స్కూల్ వదలగానే స్టాఫ్ రూమ్‌లో స్వీటు, హాటు, కూల్ డ్రింక్స్ వచ్చాయి. అందరూ ఎగబడి తిన్నారు. సారిక మటుకు చిరునవ్వుతో చూస్తూ నుల్చుంది.

మేడం తనూ కూల్ డ్రింక్ తాగుతూ అడిగింది.

"సారిక! ఇప్పుడన్నా చెప్పు పార్టీ ఎందుకిచ్చావు?"

"చెప్పాల్సిందేనా? - అయినా ఎందుకు చెప్పాలి?"

"నో! నో! చెప్పి తీరాలి! నువ్విచ్చింది అరగదు మాకు!" శ్రీధర్.

"అరే! మేం బిచ్చగాళ్ళలాగా కనిపిస్తున్నామా ఏం పెడితే అది తినడానికి!" ప్రభు వాపోయాడు.

"కొంపదీసి బిల్లు మాతో పే చేయించవు గదా!" ఆనంద్ అనుమానపడ్డాడు.

"సస్పెన్స్‌తో చంపొద్దు... రహస్యం విప్పెయ్యి!" మేడం.

"అబ్బా! ఒక్కళ్ళన్నా ఊహించండి..... చూద్దాం - "

"మాకెలా తెలుస్తుంది!" శ్రీధర్ ఒప్పుకున్నాడు.

"నీ బర్తుడే!" చెప్పాడు ప్రభు.

"నీ మ్యారేజ్ డేట్ ఫిక్సు అయింది." ఆనంద్ అన్నాడు.

"ఆల్ ఆర్ ఫూల్స్! దేరీజ్ నో రీజన్!" సారిక చెప్పింది.

"సారీ! చెప్పు - మమ్మల్ని చంపకు - కనీసం నీ కుక్క పుట్టిన రోజన్నా అయ్యుండాలి."

ఇలా అందరూ తలా ఒకటి చెప్పసాగారు - సారిక చిరునవ్వుతో తల అడ్డంగా ఊపింది.

"అరే! టైము చాలా అయింది - ఇళ్ళకెళ్ళాలి - చెబితే చెప్పు లేకపోతే లేదు." మేడం విసుక్కుంది.

"ఆ! చెబుతాను - నౌ ఐయామ్ ఫ్రీ బర్డ్! నా మ్యారేజి కాన్సిల్ అయింది!" సారిక చెప్పింది.

"వెర్రిమొహమా! పెళ్ళి విషయంలో కూడా జోకులా?" మేడం.

"కాదు ఐ యామ్ సీరియస్".

"అరే కిందటి నెలే కదా మ్యారేజి ఫిక్స్ అయిందని పార్టీ ఇచ్చావు?" గుర్తుచేశాడు శ్రీధర్.

"నిజం! బాగానే గుర్తుంది నీకు! ఇప్పుడు కాన్సిల్ అయింది, పార్టీ ఇచ్చాను" సారిక చెప్పింది.

"అరే! ఎందుకయ్యింది.... కారణం ఏమిటి? మాతో చెబితే ఆ చెంపా ఈ చెంపా పగులగొట్టేచ్చేవాళ్ళం కదా!" మేడం.

"ఓ! అంత బాగున్నాడు మీ ఆయన - ఎలా కాన్సిలయింది?" ప్రభు ఆవేదన.

"ఇది జోక్ కదూ!" ఆనంద్ జీర్ణించుకోలేక అడిగాడు.

"యస్! నా క్యారెక్టర్ మంచిది కాదట - అందుకు కాన్సిల్ చేసుకున్నారు." చెప్పింది సారిక నవ్వుతూ.

"అని ఎవరన్నారు? చెప్పు తీసుకొని కొడతాను." మేడం విరుచుకుపడింది పెళ్ళికొడుకు మీద.

"ఏమో! మనవాళ్ళే ఎవరో ఆకాశరామన్న ఉత్తరం రాసినట్లున్నారు - నా క్యారెక్టర్ మంచిది కాదని - అందుకని వదులుకున్నాడు."

అందరూ సైలెంట్ అయ్యారు.

"ఓకే-గుడ్ ఈవినింగ్! బైబై!" సారిక చెప్పింది.

"మనలో ఎవరన్నా అలా రాస్తే వాడు పురుగులు పడి చస్తాడు. బంగారం లాంటి సంబంధం పాడుచేశారు. కోటీశ్వరుడు దొరికాడు - నయా పైసా కట్నం లేకుండా చేసుకుంటున్నాడు అని మేమందరం ఎంతో సంతోషించాం - ఇలా చేస్తాడా వెధవ!" ఆమెకు బీపీ పెరిగిపోయి అరుస్తూనే వుంది మేడం.

"మేడం - సబంధం తప్పిపోయింది నాకు." సారిక గుర్తు చేసింది. మేడం ఆ జోక్‌కు కూల్‌డౌన్ అయిపోయింది.

భారమైన గుండెలతో ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

మరునాడు మేడంతో కలిసి శ్రీధర్ - ప్రభు - ఆనంద్ మిస్సయిపోయిన పెళ్ళి కొడుకు ఊరుకు బయలుదేరారు.

అతని పేరు ఏకాంబరం. స్వంత వ్యాపారం ఉంది కంప్యూటర్ ఫీల్డులో.... ఆఫీసులో పోయి కలిశారు.. ముందు అతను ఇష్టపడలేదు - వీళ్ళను కలవడానికి. ఎంతసేపటికి పోకపోయేసరికి లోపలికి పిలిచాడు తప్పదన్నట్లు.

"మిష్టర్ ఏకాంబరం! వేము విన్నది నిజమేనా? సారికను పెళ్ళి చేసుకోనంటున్నావట - అది ఆడపిల్ల జీవితం! మ్యారేజి ఫిక్స్ అయింతర్వాత కాన్సిల్ అయితే ఆ పిల్లకు జీవితం వుండదు." మేడం.

"అసలు మీరు ఎందుకు ఆ డెసిషన్ తీసుకున్నారు." అర్థం కాలేదు - ఆమె కోసం అబ్బాయిలు క్యూలో నిలబడతారు" శ్రీధర్.

"దేవతలాంటి ఆమెను కాదనటానికి మనసెలా వచ్చింది!" ప్రభు.

"ఆమెను చేసుకోవడమే జీవితానికి ఒక అదృష్టం! మీకు లక్షలు కోట్లు వుండవచ్చు - కానీ, సారిక లేని జీవితంలో ఆనందం వుండదు" - ఆనంద్ చెప్పాడు.

ఇలా నలుగురు క్లాసు తీసుకున్నారు.

చివరికి అతను ఏసీ రూము అయినా మొహానికి పట్టిన చెమటను తుడుచుకొని చెప్పాడు.

"మా మ్యారేజి ఫిక్స్ అయ్యేముందు ఆమె ప్రవర్తన గురించి నాకు తెలియదు. అక్కరలేదు. - కానీ, ఫిక్స్ అయింతర్వాత కూడా ఇంకా తప్పుడు పనులు చేస్తూ వుంటే ఏ మొగాడు క్షమించగలడు?"

"హోల్డ్ యువర్ టంగ్! ఆమె అలా చేస్తున్నదని మీరు విన్నారా? దానికి ఆధారం వుందా? కాకపోతే సారిక నలుగురితో కలుపుగోలుగా వుంటుంది అంతే!" మేడం.

"గాలి వార్తలు విని జీవితం పాడుచేసుకునేటంత మూర్ఖుడ్ని కాదు. నా దగ్గర ఉంది ఆధారం!" చెప్పాడు.

"దన్-చూపించండి-" మేడం అడిగింది.

ఏకాంబరం ఇరుకున పడ్డాడు - ఇంతమంది తను ఒక్కడు "ఫర్వాలేదు! సారిక జీవితం ఓపెన్ సీక్రెట్! మా అందరికి తెలిసినా ఏమీ అనుకోరు." చెప్పింది మేడం.

డ్రాయర్‌లోంచి ఓ కవరు బయటకు లాగాడు.

కవరులోంచి ఓ రోజ్‌కలర్ కాగితం బయటకు తీశాడు.

"ఈ ఉత్తరం చదివితే మీకే అర్థం అవుతుంది ఆమె క్యారెక్టర్ ఏమిటో! చాలా!" దూరంగా చేయి వుంచి ఆ ఉత్తరాన్ని చూపిస్తూ అడిగాడు.

"అదిటివ్వండి - చూస్తాం" మేడం అంది.

"ఇంకా నమ్మకం లేదా - ఇది సారిక రాసిన ప్రేమలేఖ - ఆమె స్వహస్తాలతో రాసింది. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వాళ్ళు నాకు పంపిచారు!" చెప్పాడు.

మేడం గతుక్కుమంది. మిత్రబృందం మొహాలు వాడిపోయాయి.

"ఓకే! ఇంతదూరం వచ్చాక మేం చదవడంలో తప్పులేదుగా. నిజంగా సారిక తప్పు చేస్తే మేము ఆమె మొహం చూడం!" మేడం ఆ మాట అనగానే ఏకాంబరం ఆ కాగితం అందించాడు. మేడం సీరియస్‌గా చదివింది. అది శ్రీధర్‌కు, ఆనంద్‌కు, ప్రభుకు పాస్ ఆన్ అయింది. తిరిగి ఏకాంబరం చేతిలోకి వెళ్ళింది.

రాని కన్నీళ్ళను వత్తుకున్నాడు రుమాలుతో.

ఇంతలో ఆనంద్ బిగ్గరగా నవ్వేశాడు. మిగతా వాళ్ళు బిత్తరపోయి అతని వంక చూశారు.

"మెంటల్ లేచిందా?" ఏకాంబరం కోపంగా అన్నాడు. "ఇంత జరిగాక కూడ నన్ను పెళ్ళిచేసుకోమంటారా!"

"ఆ! నిస్సందేహంగా - యూకెన్ మ్యారీ సారిక!" ఆనంద్ చెప్పాడు.

"నాకంత విశాలహృదయం లేదు - ఒకళ్ళని ప్రేమించి ఇంకొకళ్ళని పెళ్ళి చేసుకొనేవాళ్ళని నేను స్వీకరించలేను. నాకు తనువే కాదు - మనసు కూడా కావాలి." ఏకాంబరం సీరియస్‌గా అన్నాడు.

"ఒకే ఆల్ ది బెస్ట్!" మేడం లేస్తూ అంది.

"కూర్చోండి... కూల్‌డ్రింక్స్ అర్డరిచ్చాను - నా కోసం ఇంత శ్రమపడి వచ్చారుగా!" ఏకాంబరం అన్నాడు.

"దాంతోపాటే స్వీటు కూడా తెప్పించండి!" ఆనంద్ అన్నాడు.

"ఆనంద్! బి యిన్ యువర్ లిమిట్స్! పెళ్ళి ఫెయిలయి ఆయన బాధపడుతుంటే నీ జోక్సు ఏమిటి మధ్యలో?" మేడం కోప్పడింది.

"అరే యార్! ఇది జీవితం! ఎప్పుడు జోక్ వెయ్యాలో ఎప్పుడు వెయ్యకూడదో తెల్సుకోవాలి!" ప్రభు చెప్పాడు.

"మనం మనుషులం - అవతలవాళ్ళ మనసుల్ని అర్థం చేసుకోవాలి?" చెప్పాడు శ్రీధర్.

"అతనికి నాలాంటి పరిస్థితి వస్తే నా బాధ తెల్సి వుండేది." ఏకాంబరం అన్నాడు.

కూల్‌డ్రింక్స్ వచ్చాయి. అందరికీ ఇచ్చాడు ఆఫీస్ బోయ్! తలుపు దగ్గర వేసి వెళ్ళిపోయాడు

"ఏకాంబరంగారు! మీరు అదృష్టవంతులు - సారిక మిమ్మల్ని ఎంత గాఢంగా ప్రేమిస్తున్నదో అర్థం అవుతున్నది" ఆనంద్ అన్నాడు.

"యూ ఫూల్ గెటౌట్!" అరిచాడు ఏకాంబరం.

"అరే! సైలెంట్ ఆనంద్! సారీ సారీ... మేము వస్తాం!" మేడం అంది.

"జస్ట్ వన్ మినిట్!" కూర్చోబెట్టాడు ఆనంద్.

"ఇంకా తిట్లు తినాలా?" ప్రభు కోపంగా అన్నాడు.

"మెడ పట్టి గెట్టించుకోవాలా!" శ్రీధర్ అసహనంగా అన్నాడు.

"ఏకాంబరంగారూ! మీకు తెలుసు సాహిత్యం గురించి ఓనమాలు తెల్సి వుంటాయని నేను అనుకుంటున్నాను." ఆనంద్ అన్నాడు.

"తెలియకపోయినా మీ దగ్గర ట్యూషన్‌కొచ్చేంత టైము నాకు లేదు." ఏకాంబరం ఆవేశపడ్డాడు.

"అంత అక్కరలేదు - నండూరి ఎంకి విన్నారా! విశ్వనాథవారి కిన్నెరసాని విన్నారా! మునిమాణిక్యంగారి కాంతం విన్నారా!"

"సో వాట్!"

"అదే ఇది! ఆ కవులు ఒక పాత్రను ఊహించుకొని తమ కవిత్వాన్ని వెళ్ళగక్కుతారు. సారిక కూడా అంతే! ఆమె ఒక కవయిత్రి! ఏకాంతంలో ఉన్నప్పుడు తనలోని భావాలను వ్యక్తపరుస్తుంది కాగితాలమీద."

"కానీ, ఈ హరి ఎవరు? వాడికి ప్రేమ లేఖ ఏమిటి?" ఏకాంబరం చిరాగ్గా అడిగాడు.

"ఆమెకు హరి అన్న పేరు చాలా ఇష్టం! ఆడపిల్ల పుడితే హరిణి అని పెట్టుకుంటుంది - అబ్బాయి పుడితే హరిప్రసాద్ అని పెట్టుకుంటుంది. భర్త దొరికితే హరి అని పిల్చుకుంటుంది - ఆ పేరు ఆమెకిష్టం! ఏం మీకు కష్టంగా వుందా?" ఆనంద్ చెప్పాడు.

"సారీ! సారిక!" ఏకాంబరం సిగ్గుతో తలవంచుకున్నాడు.

ఏకాంబరం మొహంలో రంగులుమారాయి.

"నిజమా ఆనంద్?!" అడిగాడు.

"అవునుసార్! నేను చాలాసార్లు విన్నాను. ఆమెకు హరి అన్న పేరు ఇష్టం - తను కవిత్వం రాస్తూ వుంటుంది. దాంలో హరి అని చాలాసార్లు రాస్తుంది." మేడం అందుకని తన అనుభవాలు చెప్పింది.

"గిట్టనివాళ్ళు ఆమె రాసి పుస్తకంలో పెట్టుకున్న కాగితాన్ని మీకు పోస్టు చేశారు. మీరు నమ్మేశారు" ప్రభు చెప్పాడు.

"కొంచెం విశాల హృదయంతో ఆలోచించండి - ఆమె నోట్‌బుక్‌లో రాసుకున్నది మీకు పోస్టు చేశారంటే దాని వెనకాల దురుద్దేశం ఏముందో?" శ్రీధర్ రిక్వెస్టు చేశాడు.

"అయితే నిజంగా హరి అనే ప్రియుడు లేడా!" ఏకాంబరం ఆశ్చర్యంగా అడిగాడు - ఆ ఉత్తరాన్ని చూస్తూ.

"మీ తోడు లేడు - పెళ్ళయిన తరువాత మీరే హరి!" నలుగురు చెప్పారు.

( ఆంధ్రభూమి 20-1-2001 )